అణ్ణాదురై పూర్తిపేరు కాంచీపురం నటరాజ అణ్ణాదురై. కంచిలో పద్మశాలి (సెన్‌గోట్ట మొదలియార్లు అని కూడా అంటారు) కుటుంబంలో 1909లో పుట్టారు. తల్లి బంగారమ్మాళ్ (బంగారు అనే పేరు తెలుగువాళ్లే పెట్టుకుంటారు. కంచీవరం కాబట్టి తెలుగు కనక్షన్ ఏమైనా వుందేమో తెలియదు. అన్నా తెలుగువాడని ఎవరూ అనగా వినలేదు) తండ్రి నటరాజన్. పినతల్లికి పిల్లలు లేకపోవడంతో అతన్ని పెంపకానికి యిచ్చారు. ఆవిడ చాలా గారాబంగా పెంచింది. చిన్నప్పటినుంచీ అతను చాలా బాగా చదివేవాడు. తమిళ-ఇంగ్లీషు పత్రికలు, పుస్తకాలు, సాహిత్యం విపరీతంగా చదివేవాడు. అమోఘమైన జ్ఞాపకశక్తి. హైస్కూల్లో చదువుతుండగా చిన్న చిన్న నాటకాలు వేసేవాడు. స్కూలుఫైనల్ పాసయి మద్రాసులోని పచ్చయప్ప కాలేజీలో ఇంటర్, ఆ పై ఆనర్స్ చదివాడు. ఆ దశలో ఘాటైన ఉపన్యాసాలు యిస్తూ విద్యార్థి నాయకుడిగా ఎదిగాడు. ఉద్యమాలు నడిపాడు.


అణ్ణాదురై

పన్నెండేళ్లు వచ్చేదాకా రోజూ శ్రద్ధగా పూజ చేసే అన్నా క్రమేపీ పెరియార్ ప్రభావంలో పడ్డాడు. ఆయన నడిపే పత్రికలకు అన్నా వ్యాసాలు రాసి పంపి డబ్బులు సంపాదించేవాడు. చదువయ్యాక కుటుంబభారం తలకెత్తుకుని కాలేజీ ట్యూటర్‌గా పనిచేసేవాడు. చెట్టినాడు రాజావారు తన సెక్రటరీగా ఉద్యోగం ఆఫర్ చేసినా ట్యూటర్‌గా విద్యార్థులకు చేరువగా వుండవచ్చని ఆ ఉద్యోగం తిరస్కరించాడు. తన 21 వ యేట తలిదండ్రులు ఎంపిక చేసిన రాణి అనే అమ్మాయిని పెళ్లాడాడు. అదీ సాంప్రదాయబద్ధంగా ! వాళ్లకు పిల్లలు లేరు. ద్రవిడ ఉద్యమంలో చాలామంది నాయకుల వ్యక్తిగత జీవితాలు వివాదాస్పదం. కానీ అన్నా కుటుంబజీవితం కూడా మచ్చలేనిది. ఆయన భార్యను చాలా గౌరవంగా చూసుకున్నారు. పెరియార్ జస్టిస్ పార్టీ నాయకత్వం వహించాక అంటే తన 29 ఏళ్ల ప్రాయంలో అన్నా పెరియార్‌కు పూర్తిగా శిష్యుడయ్యారు. శిష్యుడై ఆయన సిద్ధాంతాలు ప్రచారం చేసినా, ద్రవిడనాడు ఏర్పడాలని పుస్తకాలు, నాటకాలు, సినిమాలు రాసినా, ఉపన్యాసాలు యిచ్చినా, శిష్యగణాన్ని ఏర్పరచుకున్నా అన్నా నిబద్ధత గల మనిషి, జాతీయతావాది, ఉదారవాది. ఆయనను ప్రత్యర్థులు సైతం గౌరవించారు.

కరుణానిధి 12 ఏళ్ల వయసు వచ్చేసరికే పెరియార్ అనుచరులు ఊరూరా నిర్వహించే సమావేశాలకు హాజరయ్యేవాడు. అక్కడ వాళ్లు ప్రస్తావించే అంశాలు గ్రామస్తులకు చాలా వింతగా తోచేవి. వాటి హేతుబద్ధత గురించి తమలో తాము చర్చించుకునేవారు. విద్యార్థులకు వీటిపై మరీ ఆసక్తి వుండేది. కరుణానిధికి వీటి గురించి ఆలోచించడమే కాక తన ఆలోచనలను కాగితం మీద పెట్టగల శక్తి వుంది కాబట్టి "మానవర్ మురసు" (విద్యార్థి ఢంకా) అనే పత్రిక ప్రారంభించాడు. దానిలో ప్రతీ అక్షరం అతనే రాసేవాడు. అందరూ దాన్ని ఆదరించడంతో తన దృష్టిని రాజకీయాలపై మళ్లించి "మురసొలి" (ఢంకా చప్పుడు) అనే యింకో రాజకీయకరపత్రం ప్రచురించేవాడు. దానిలో 'చేరన్' అనే కలంపేరుతో తన భావాలను చాలా ధైర్యంగా వెలిబుచ్చేవాడు. కరుణానిధితో బాటు ఈ 'మురసొలి' కూడా పెరిగి పెద్దదైంది. కరుణానిధి రాజకీయాల్లో బాగా బిజీ అయిపోయిన తర్వాత అతని మేనల్లుడు మారన్ (కళానిధి, దయానిధి)ల తండ్రి. ఈ పత్రికను నిర్వహించేవాడు. అతనూ రచయిత, వక్త. చివరకు అతని పేరుకు ముందు "మురసొలి" వచ్చి చేరిపోయింది. కేంద్రమంత్రిగా పనిచేసినపుడు కూడా అతనిని 'మురసొలి మారన్' అనేవారు, అదేదో యింటిపేరు అన్నట్టు.

ఈ "మురసొలి" స్థానికంగా వున్న ద్రవిడ రాజకీయ నాయకుల దృష్టిని ఆకర్షించింది. అదే సమయంలో పెరియార్ 'ద్రవిడ కళగం' (డికె) అనే పేర సంస్థ స్థాపించి, హిందీ వ్యతిరేక ఉద్యమం నడుపుతున్నారు. విద్యార్థులలో ఆ ఉద్యమం చొచ్చుకుపోవాలంటే చురుకైన విద్యార్థి నాయకుడు ఎవరైనా కావాలని చూస్తున్నారు. పెరియార్‌కు ప్రసంగాలు తయారుచేసి యిచ్చే పట్టుకోట్టయ్ అళగిరిస్వామి కరుణానిధిని గుర్తు పెట్టుకుని తిరువారూర్ వచ్చినపుడు యితన్ని పిలిచి తమ ఉద్యమంలో పనిచేయమని అడిగాడు. ఆయనంటే కరుణానిధికి ఆరాధన. తక్షణం సరేనన్నాడు. డికె మీటింగులు తనే స్వయంగా ఏర్పాటు చేయడం మొదలుపెట్టాడు.

ఒకసారి విరాళాలు పోగుచేసి తన స్కూలులో డికె వారి ప్రసంగం ఏర్పాటు చేశాడు. సమావేశం పూర్తయ్యాక చూసుకుంటే వక్తలకు యివ్వడానికి డబ్బు లేదని తేలింది. ఆ రాత్రి వాళ్లను అక్కడే పడుకోమని చెప్పి కరుణానిధి వెంటనే తన వూరికి పరిగెట్టుకుని వెళ్లి తల్లి నగల్లో ఒకదాన్ని దొంగిలించి, తాకట్టు పెట్టి ఉదయానికల్లా డబ్బులు ఏర్పాటు చేశాడు. వాళ్లిద్దరూ తర్వాత కరుణానిధి నేతృత్వంలో పనిచేశారు. ఒకరు మదిఅళగన్. రెండో అతను అన్బళగన్. ఇలాటి హీరోయిజం ప్రదర్శించి కరుణానిధి యింతింతై వటుడింతయై అన్నట్టు ఎదిగిపోయాడు. అతని కంటె వయసులో పెద్దవాళ్లు కూడా అతన్ని 'తలైవర్' (నాయకుడు) అని పిలిచేవారు. ఈ హుషారులో చదువు వెనకబడింది. మురసొలి నడపడం, ఉద్యమంలో తిరగడం, సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం, తక్కినవారికి ప్రసంగాలు రాసి పెట్టడం... వీటితో పరీక్ష మూడుసార్లు తప్పాడు. ఆ తర్వాత యిక స్కూలుకి వెళ్లడమే మానుకున్నాడు. తలిదండ్రులు ఎంత బతిమాలినా వినలేదు. గట్టిగా ఒత్తిడి చేస్తే యింట్లోంచి పారిపోయి సైన్యంలో చేరిపోతానని బెదిరించి వాళ్ల నోళ్లు మూయించేవాడు.

కరుణానిధికి 14 ఏళ్ల వయసు వచ్చేసరికి అన్నాచేత ప్రభావితుడయ్యాడు. అన్నా రాసే తమిళభాష చాలా సుందరమైనది. వర్ణనలు, ఉపమానాలు, అతిశయోక్తులు, భారీ వాక్యాలు ఎక్కువ. ఫ్లవరీ లాంగ్వేజ్ అంటాం కదా అలాటిది. తర్వాత తర్వాత తమిళ సినిమాలలో యిదే వాడారు. కరుణానిధి యిదే ధోరణిలో 'యువకుల త్యాగం' అనే వ్యాసం రాసి అన్నా నడిపే "ద్రవిడనాడు" పత్రికకు పంపాడు. అన్నా వెంటనే దాన్ని ప్రచురించారు. ఇక కరుణానిధి ఉత్సాహం పట్టలేక మరిన్ని రాసి పంపించాడు. ఒక్కటి కూడా పడలేదు. ఇతను హతాశుడై వూరుకోలేదు. అన్నా వాళ్ల వూరు వచ్చినపుడు నిలదీశాడు. అన్నా అతని భుజం తట్టి చిరునవ్వుతో "నువ్వు చిన్నవాడివి,



అణ్ణాదురై నడిపిన ద్రవిడనాడు

చదువుకోవలసినవాడివి. బాగా చదువుకుని రాజకీయాల్లోకి వచ్చాక వ్యాసాలు రాద్దువుగాని. నీ వ్యాసాలు బాగున్నా ఇప్పట్నుంచి నిన్ను ప్రోత్సహిస్తే చదువు చెడిపోతుంది” అన్నారు. ఆయనకు తెలియదు, అప్పటికే కరుణానిధి చదువు చెట్టెక్కిందని.

కరుణానిధికి యీ సలహా గిట్టలేదు. “ఈయన ద్రవిడనాడు పత్రిక కంటె నా మురసొలి పత్రిక ఎక్కువ పాప్యులర్ అయ్యేట్లు చేస్తాను’ అని శపథం పట్టి అప్పటిదాకా చేతివ్రాతతో వెలువడే మురసొలిని అప్పటినుండి అచ్చువేయించడం ప్రారంభించాడు. దీనివలన అతని పేరు చుట్టుపక్క వూళ్లలో కూడా తెలియ సాగింది. నిజానికి కరుణానిధికి తమిళభాష చాలా వుపయోగపడింది. కానీ తమాషా ఏమిటంటే తమిళభాషకే తన వలన ఉపకారం జరిగిందని కరుణానిధి ప్రచారం చేసుకుంటారు. కరుణానిధి ప్రేమకథ వచ్చే శుక్రవారం (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2011)**